
# మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే..

- 50వేల మెజార్టీతో పద్మాదేవేందర్‌రెడ్డి విజయం ఖాయం
- ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్
- సైనికులుగా పని చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు
- బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్



మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: మెదక్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, దాదాపు 50 వేల భారీ మెజార్టీతో పద్మాదేవేందర్‌రెడ్డి విజయం సాధిస్తారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. నవంబర్ 30న జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో మెదక్ పట్టణంతో పాటు నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్ పక్షానే నిలిచారని అన్నారు. ఈ నెల 3న ఎన్నికల ఫలితాలు ప్రతిపక్షాలకు, ధన రాజకీయం చేసిన వారికి చెంపపెట్టులాగా వస్తాయని, మెదక్ నియోజకవర్గ ప్రజలు ప్రతిపక్షాలకు దిమ్మతిరిగేలా తీర్పు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్లోబల్ ప్రచారాలను ప్రజలు నమ్మలేరన్న విషయాన్ని గురువారం జరిగిన ఓటింగ్ సరళి చూస్తేనే తెలిసిపోయిందన్నారు. ఫలితాల అనంతరం ప్రతిపక్ష పార్టీలు తట్టబుట్టా సర్దుకొని వెళ్లి పోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిలో రాష్ర్టాన్ని పరుగులు పెట్టిస్తున్న బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలన్న భావన ఓటర్లలో కనిపించిందన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని మునుపెన్నాడు లేని విధంగా పద్మాదేవేందర్‌రెడ్డి అభివృద్ధి చేశారని.. చేసిన అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలంతా కారు గుర్తుకు ఓటేశారని విశ్వాసం వ్యక్తం చేశారు. పద్మాదేవేందర్‌రెడ్డి విజయంతో మెదక్ నియోజకవర్గ అభివృద్ధి పరంపర కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కానుందన్నారు. ఎన్నికల్లో నెల రోజులుగా బీఆర్‌ఎస్ విజయానికి సైనికులుగా పనిచేసిన ప్రతి కార్యకర్తకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గంగాధర్ పేర్కొన్నారు



బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్

## చిన్నశంకరంపేటలో 88.81శాతం పోలింగ్

చిన్నశంకరంపేట,డిసెంబర్1: గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల్లో చిన్నశంకరంపేట మండలంలో 40 పోలింగ్ కేంద్రాల్లో 88.81 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 30, 372 మంది ఓటర్లు ఉండగా 26,972 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 13,269 మంది 13,703 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులంటే 433 మంది మహిళలే అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో అత్యధిక పోలింగ్ శాతం పోలింగ్ బూత్ నెంబర్ 232 శాలిపేటలో 95.57 శాతం పోలింగ్ నమోదైంది. అతి స్వల్పంగా పోలింగ్ బూత్ నెంబర్ 199 ఖాజాపూర్‌లో 82.64 శాతం నమోదైంది.



అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న చైర్మన్ దంపతులు

## వైభవంగా అమ్మవారికి అభిషేకాలు

రామాయంపేట, డిసెంబర్1: పట్టణంలోని మహంకాళి మాత ఆలయంలో అమ్మవారికి వైభవంగా అభిషేకాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి సన్నిధికి భక్తులు ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు పాండురంగాచారి-వరలక్ష్మిలతో పాటు భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి కార్తికమాస ఉత్సవాల్లో భాగంగా అభిషేకాలను నిర్వహించి మంగళహారతులు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చైర్మన్ దంపతులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నాగరాజాచారి, సిబ్బంది శ్యాంరాజు, యాదగిరి, సత్యం, నరేశ్, లక్ష్మి ఉన్నారు.

## ఒకేషనల్ విద్యార్థులకు ఆన్‌జాబ్ శిక్షణ

రామాయంపేట, డిసెంబర్ 1: ఆన్‌జాబ్ శిక్షణను ఒకేషనల్ విద్యార్థులు శ్రద్ధతో నేర్చుకోవాలని ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, కళాశాల అధ్యాపకుడు బాలప్రకాశ్ సూచించారు. శుక్రవారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఒకేషనల్ శిక్షణపై 'ఆన్‌జాబ్ శిక్షణ'ను చేపట్టారు. పట్టణంలోని విద్యుత్ స్తంభం వద్ద, వైండింగ్ వర్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులతో పనులు చేయించారు. విద్యార్థులు తమ శిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు వస్తాయని బాలప్రకాశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆన్‌జాబ్ శిక్షణపై ఒకేషనల్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌ను ఇస్తున్నాయని అందుకోసం ఒకేషనల్‌లో మంచి ప్రతిభను కనబరిస్తే జీవితంలో స్థిరపడతారని సూచించారు.



కలెక్టర్ రాజర్షి షాను శాలువాతో సత్కరించిన టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

## కలెక్టర్ రాజర్షి షాకు సత్కారం

మెదక్ అర్బన్, డిసెంబర్1: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా కృషి చేసి పోలింగ్ శాతం నమోదులో మెదక్‌ను రాష్ట్రంలోనే ద్వితీయస్థానంలో నిలిపారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. శుక్రవారం టీఎన్జీవో అధ్యక్షుడు ఆధ్వర్యంలో తన బృందంతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షాను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ఎన్నికలను ప్రశాంతంగా ముగించామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ నియంత్రణలో యువతే కీలకం

అవగాహన సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్




సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: సురక్షితం కాని లైంగిక సంబంధాలతో హెచ్ఐవీ సంక్రమిస్తుందని, ఈ వైరస్ రోగ నిరోధక వ్యవస్థపై దాడి చేసి దాని నిరోధకతను తగ్గిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. 'ప్రపంచ ఎయిడ్స్ (హెచ్ఐవీ) డే' పురస్కరించుకొని శుక్రవారం వృక్షశాస్త్రం, జంతు శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు హెచ్ఐవీ రావడానికి గల కారణాలు, నివారణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణలో యువత పాత్రే కీలకమని వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ వ్యాఖ్యాన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్, ధనశ్రీ, దినకర్, విశ్వనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దుర్మరణం

రామాయంపేట, డిసెంబర్ 1: ట్రాక్టర్ అదుపు తప్పి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన రామాయంపేట మండలం డి.ధర్మారంలో గురువారం రాత్రి జరిగింది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. డి.ధర్మారం గ్రామానికి చెందిన నక్కని నవీన్(27) తన స్వగ్రామంలో రాత్రి ట్రాక్టర్‌పై వరిధాన్యం తెస్తుండగా డ్రైవర్ పక్కనే కూర్చున్న నవీన్ అదుపుతప్పి ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ మృతుడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై రంజిత్ తెలిపారు.



నక్కని నవీన్ (ఫైల్)

## 31 వరకు జిల్లాలో పోలీస్ యాక్ట్

- మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని

మెదక్ అర్బన్,డిసెంబర్1: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని ఈనెల ఆఖరు వరకు (డిసెంబర్ 31) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ సూచించారు. జిల్లా ప్రజలు ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.



ఎయిడ్స్ దినం సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్

## ఎయిడ్స్‌కు నియంత్రణే మార్గం

మెదక్ అర్బన్, డిసెంబర్1: హెచ్ఐవీ అనేది ఒకరువాడిన వస్తువులు మరొకరు వాడితే రాదని జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటాలాల్‌చంద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.... హెచ్ఐవీ అనేది ప్రత్యక్ష తాకిడితో రాదని, లైంగిక సంబంధం, కలుషిత రక్తం వల్ల వస్తుందని, ఎయిడ్స్ నియంత్రణే మార్గమన్నారు. పిల్లల అతిప్రవర్తన వల్ల నేరాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చందునాయక్, న్యాయవాదులు, డాక్టర్లు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి

రామాయంపేట, డిసెంబర్ 1: మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య 14వ వర్ధంతిని రామాయంపేట పట్టణంలో నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాల ముందు కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి సావిత్రి బాయిపూలే సంఘం జిల్లా అధ్యక్షురాలు పోచమ్మల అశ్విని, మదిరాజ్ సంఘం నాయకుడు ఎర్రం ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించి, కిష్టయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, పోచయ్య, కిషన్, శ్రీనివాస్, స్వామి, మహేశ్ తదితరులున్నారు.



గర్భిణీలకు పౌష్టికాహారం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

## పౌష్టికాహార వారోత్సవాలు

రామాయంపేట, డిసెంబర్ 1: రామాయంపేట పట్టణంతో పాటు మండలంలోని కోనాపూర్, అక్కన్నపేట, డి.ధర్మారం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహార వారోత్సవాలు జరుగుతున్నాయి. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు, గర్భిణీలకు ప్రతిరోజూ ప్రభుత్వం అందజేసిన మెనూను చిన్న పిల్లలకు, గర్భిణీలకు ఆహారాన్ని అందజేస్తున్నట్లు శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. రికార్డులు సైతం ఎప్పటికప్పుడు రామాయంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో పెండింగ్ లేకుండా అందజేస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, ఆయాలు ఉన్నారు.